

ఆయుధ పూజలో పాల్గొన్న భద్రాద్రి ఎస్పీ రోహిత్ రాజు

జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో
ఘనంగా ఆయుధ పూజ

పూజలో పాల్గొన్న భద్రాద్రి ఎస్పీ రోహిత్ రాజు

కొత్తగూడెం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): హేమచంద్రాపురంలోని జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో బుధవారం దసరా నవరాత్రుల సందర్భంగా ఆయుధపూజను ఘనంగా ఏర్పాటు చేశారు. ఈ పూజా కార్యక్రమంలో భద్రాద్రి ఎస్పీ రోహిత్‌రాజు హాజరై పూజలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ భక్తిశ్రద్ధలతో నవరాత్రి ఉత్సవాలను జరుపుకోవడంలో భాగంగా ఆయుధపూజ కార్యక్రమంలో పాల్గొనడం సంతోషంగా ఉందని తెలిపారు. పూజ అనంతరం వాహనపూజ నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ టి.సాయిమనోహర్, కొత్తగూడెం డీఎస్పీ రెహమాన్, పాల్వంచ డీఎస్పీ సతీష్‌కుమార్, డీసీఆర్‌బీ డీఎస్పీ మల్లయ్యస్వామి, ఏఆర్ డీఎస్పీ సత్యనారాయణ, ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా పోలీస్ అధికారులు, సిబ్బందికి ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



5
భద్రాద్రి కొత్తగూడెం
గురువారం, 10 అక్టోబరు 2024



పోయి రావమ్మా.. బతుకమ్మా!

- నేడే సద్దుల బతుకమ్మ
- పతాకస్థాయికి తొమ్మిది రోజుల పూల వేడుక
- ఒక రోజు ముందే తీరొక్క పూల కొనుగోలు
- వయోభేదం లేకుండా సన్నద్ధం అవుతున్న మహిళా లోకం
- ఇరు జిల్లాల్లో విస్తృత ఏర్పాట్లు చేసిన అధికారులు

పూల సంబురం పతాకస్థాయికి చేరింది.. గౌరమ్మను గంగమ్మ ఒడికి సాగనంపే ఘట్టం రానే వచ్చింది.. సద్దుల బతుకమ్మ పర్వానికి రంగం సిద్ధమైంది. తీరొక్క పూలతో బతుకమ్మను పేర్చి 'శ్రీలక్ష్మి నీ మహిమలూ గౌరమ్మ..' అంటూ ఆటపాటలతో కొలిచేందుకు మహిళాలోకం సన్నద్ధమైంది. తొమ్మిది రోజుల పూలజాతరలో చివరి ఘట్టమైన సద్దుల బతుకమ్మ వేడుకను గురువారం ఘనంగా జరుపుకోనున్నారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రాలతో పాటు వివిధ ప్రాంతాల్లో సద్దుల బతుకమ్మను కొలిచేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఖమ్మంలో మున్నేటి తీరంలో, కొత్తగూడెంలో ముర్రేడు ఘాట్, గోధుమవాగు చెంతన ఆటపాటలు సందడి చేయనున్నాయి. వయోభేదం లేకుండా మహిళలు బతుకమ్మలను చేబూని తరలివచ్చే దృశ్యాలు కన్నులపండువ చేయనున్నాయి. గుంపులు గుంపులుగా చేరి ఆడిపాడిన అనంతరం బతుకమ్మలను చెరువుల్లో నిమజ్జనం చేయనున్నారు. తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు నిలువెత్తు ప్రతీకగా నిలిచే సద్దుల బతుకమ్మ వేడుకను కళ్లారా తిలకించి పులకించాల్సిందే.

6

- ఖమ్మం సాంస్కృతికం/కొత్తగూడెం సాంస్కృతికం



ఖమ్మం పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో బతుకమ్మ వేడుకల్లో సీపీ దంపతులు



ఖమ్మం బీఆర్‌ఎస్ కార్యాలయంలో

'అభివృద్ధి' పది కాలాలుండాలి

- అర్హత కలిగిన లబ్ధిదారులందరికీ సంక్షేమ ఫలాలు: మంత్రి తుమ్మల
- ఖమ్మంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన



6

ఖమ్మంలో సీసీ రహదారులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ప్రతీ హామీని నెరవేరుస్తాం..

- ఆరు గ్యారంటీల్లో సగానికిపైగా అమలు చేశాం: మంత్రి పొంగులేటి
- నారాయణపురంలో సొంత వ్యవసాయ క్షేత్రం సందర్శన



6

ఖమ్మం రూరల్‌లో కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి

బోనస్ బొనాంజా..

రాష్ట్ర ప్రభుత్వం ఈ సీజన్ నుంచి సన్న ధాన్యానికి రూ.500 బోనస్ ప్రకటించిన నేపథ్యంలో దీని అమలులో జిల్లా అధికార యంత్రాంగం పలు సమస్యలు ఎదుర్కోబోతోంది. భౌగోళికంగా ఉమ్మడి ఖమ్మం జిల్లా ఏపీకి సరిహద్దున ఉండడంతో ఆ రాష్ట్రంలో పండించిన ధాన్యం జిల్లాలోకి ప్రవేశించే అవకాశం ఉంది. ముఖ్యంగా మిర్చి, వరి ధాన్యం ఉమ్మడి జిల్లా మార్కెట్లకు భారీగా వస్తుంటుంది. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాకు ఏపీ నుంచి ధాన్యం రవాణాను అడ్డుకోవడం అధికారులకు పెద్ద సవాల్‌గా మారనుంది.



సన్నధాన్యంతో సవాలే...

ఈ సీజన్ నుంచే క్వింటాల్‌కు రూ.500 బోనస్ చెల్లింపు

- అప్రమత్తంగా లేకపోతే ఏపీ నుంచి భారీగా ధాన్యం సరిహద్దు దాటే అవకాశం
- పటిష్ట నిఘా, తనిఖీలతోనే అక్రమ తరలింపునకు చెక్
- లేదంటే బోనస్ సొమ్ము స్వాహా అయ్యే ప్రమాదం

ఖమ్మం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఈ వానాకాలం ధాన్యానికి ఎఫ్‌సీఐ నిర్ణయించిన ప్రకారం సన్నాలకు రూ.2,320, సాధారణ రకాలకు రూ.2,300ధర ఉండగా, సన్న ధాన్యానికి ప్రభుత్వం అదనంగా రూ.500 బోనస్ చెల్లించనుంది. ఈ నేపథ్యంలో ఇతర ప్రాంతాలనుంచి సరిహద్దు దాటి జిల్లాలోకి ధాన్యం వచ్చే అవకాశం ఉంది. ఉమ్మడి ఖమ్మంజిల్లాకు సరిహద్దున ఏపీలోని ఉమ్మడి కృష్ణా, ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో ధాన్యం భారీగా ఉత్పత్తి అవుతోంది. కృష్ణా, గోదావరి జిల్లాల్లో సన్నరం ధాన్యం అధికంగా పండుతుంది. దీంతో అక్కడ ధాన్యం వ్యాపారులు ఇక్కడ రైతులు, ఇతర వ్యాపారులతో సయోధ్య చేసుకుని అక్రమంగా తెలంగాణ రైతుల పేరుతో ఇక్కడ ధాన్యం విక్రయించే అవకాశాలు అధికంగా ఉన్నాయి. ఇప్పటికే ప్రభుత్వ మార్క్‌ఫెడ్ పెసల కొనుగోలు కేంద్రాలకు రైతులు పండించిన పెసల కంటే వ్యాపారులు కొనుగోలు చేసిన పెసలనే అధికంగా రైతుల పేరిట విక్రయించి లబ్ధిపొందుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో గ్రామ స్థాయి నుంచి (మిగతా 6వ పేజీలో)

పారిశుధ్య కార్మికులకు
కొత్త యూనిఫామ్

డిజైన్ చేయిస్తున్న కమిషనర్ అభిషేక్



ఖమ్మం సంక్షేమ విభాగం, అక్టోబరు 9: ఖమ్మం నగర పాలక సంస్థ పారిశుధ్య కార్మికులకు ఖాకీ దుస్తుల స్థానంలో కొత్త యూనిఫాం అందుబాటులోకి రానుంది. కేఎంసీ పరిధిలో డ్రైవర్లకు ఖాకీ దుస్తులు, వీధులను శుభ్రం చేసే వారికి బ్లూ కలర్ యూనిఫాంలపై రేడియమ్ స్టిక్కర్లు అతికించి వాడుతున్నారు. గత సెప్టెంబరులో మున్నేరు ముంపు ప్రాంతాల్లో పారిశుధ్య సేవలు అందించేందుకు సీడీఎంఏ డైరెక్టర్ వీపీ గౌతమ్ ఆదేశాల మేరకు 250మంది కార్మికులు వరంగల్ నుంచి ఖమ్మం వచ్చారు. వారి యూనిఫాం ఆకర్షణీయంగా ఉండటంతో అదే తరహాలో కేఎంసీ మార్కుతో ఖమ్మంలో పనిచేసే 1,004 మంది పారిశుధ్య కార్మికులకు యూనిఫాం అందించేందుకు డిజైన్లు పరిశీలన చేశారు. కేఎంసీ కార్మికులకు త్వరలో నూతన యూనిఫాంలు అందనున్నాయి.

అత్తింటి వేధింపులపై
కోడలి ఫిర్యాదు

- ఆందోళనతో భర్త, అత్తామామల ఆత్మహత్యాయత్నం
- బాధితురాలి స్వస్థలం చుంచుపల్లి మండలం
- మెట్టినింటి వారిది హైదరాబాద్



6

బంతిపూల కోసం వెళ్తూ...

- రోడ్డు ప్రమాదంలో ఇద్దరు భవానీ దీక్షాపరుల దుర్మరణం
- కొమ్ముగూడెం వద్ద ఆటోను ఢీకొట్టిన బస్సు
- మృతులు పాల్వంచ మండల వాసులు

జూలూరుపాడు/పాల్వంచ, అక్టోబరు 9: వాళ్లిద్దరూ భవానీదీక్షలో వున్నారు. పూజ కార్యక్రమాల కోసం బంతిపూలు తీసుకు వచ్చేందుకు ఆటోలో బయలుదేరారు. కానీ విధి వక్రించింది. ఎదురుగా వచ్చిన ఆర్టీసీ బస్సు మృత్యువై కాటేసింది. ఇద్దరూ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. భవానీ దీక్షా దుస్తుల్లో వున్న ఇద్దరు యువకులు విగతజీవులుగా పడివున్న దృశ్యం ప్రతీ ఒక్కరిని కలచివేసింది. జూలూరుపాడు మండలంలోని కొమ్ముగూడెం గ్రామ సమీపంలో బుధవారం జరిగిన ఈ ఘటనలో పాల్వంచ మండలానికి చెందిన ఇద్దరు యువకులు దుర్మరణం చెందారు. వివరాల్లోకెళితే.... పాల్వంచ మండలం జగన్నాధపురం గ్రామానికి చెందిన బానోత్ సంతోష్(24), బసవతారక కాలనీకి చెందిన గుగులోత్ మనోహర్(20) ఆటోలో కొత్తగూడెం వైపు నుంచి జూలూరుపాడు వస్తున్నారు. ఇద్దరిలో మనోహర్ ఆటో నడుపుతున్నారు.



బానోత్ సంతోష్, గుగులోత్ మనోహర్ (ఫైల్)



సంఘటనా స్థలం వద్ద మృతదేహాలు

ఈ క్రమంలో ఆర్టీసీ మణుగూరు డిపోకి చెందిన సూపర్ లగ్జరీ బస్సు జూలూరుపాడు నుంచి కొత్తగూడెం వైపు వెళుతూ కొమ్ముగూడెం గ్రామ సమీపంలో ఎదురుగా వస్తున్న ఆటోని ఢీకొట్టింది. ఈ సంఘటనలో సంతోష్, మనోహర్ మృతి చెందారు. మృతులిద్దరూ భవాని దీక్షా మాలను ధరించి ఉన్నారు. సంతోష్ జగన్నాధపురంలో ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌ను నిర్వహిస్తుండగా, మనోహర్ బీ-ఫార్మసీ చదువుతున్నాడు. మృతులిద్దరూ అవివాహితులు. ఘటనా స్థలంలో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. సంఘటన స్థలాన్ని జూలూరుపాడు సీఐ ఇంద్రసేనారెడ్డి, ఎస్ఐ రాణాప్రతాప్‌లు సందర్శించారు. ప్రమాద వివరాలను నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాలను పంచాయతీ ట్రాక్టరులో కొత్తగూడెం మార్చురీకి తరలించారు.

పాల్వంచలో విషాదం...

జూలూరుపాడు మండలం కొమ్ముగూడెంలో సంతోష్, మనోహర్‌లు మృతి చెందడంతో పాల్వంచ మండలంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. స్థానికుల కథనం ప్రకారం... పాల్వంచ మండలం బసవతారక కాలనీకి చెందిన గుగులోతు మనోహర్ ఓ ప్రైవేటు కాలేజీలో బీ-ఫార్మసీ (మిగతా 6వ పేజీలో)

నెరవేరుతున్న కల

- జిల్లాలో మూడు చోట్ల సమీకృత గురుకులాల సముదాయం
- రేపు శంకుస్థాపన చేయనున్న ఉప ముఖ్యమంత్రి, మంత్రులు
- తొలిదశలో ఖమ్మం, పాలేరు, మధిర నియోజకవర్గాల్లో ఏర్పాటు
- స్థలాలను పరిశీలించిన కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్



పొన్నెకల్లు సమీకృత గురుకులాల భవన నిర్మాణ సముదాయ స్థలాలను పరిశీలిస్తున్న కలెక్టర్

ఖమ్మం, ఖానాపురం హవేలి/రఘునాథపాలెం/ఖమ్మంరూరల్, అక్టోబరు 9: జిల్లాలోని ఖమ్మం, పాలేరు, మధిర నియోజకవర్గాల్లో సమీకృత గురుకులాల భవన నిర్మాణ పనులకు 11న శంకుస్థాపన జరుగుతుందని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ఉపముఖ్యమంత్రి, మంత్రులు పాల్గొననున్నందున పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ బుధవారం సమీకృత గురుకులాల సముదాయాలు నిర్మించే స్థలాలను పరిశీలించారు. పాలేరు నియోజకవర్గానికి సంబంధించి ఖమ్మంరూరల్ మండలం పొన్నెకల్లు వద్ద, ఖమ్మం నియోజకవర్గానికి సంబంధించి రఘునాథపాలెం మండలం జింకలతండా వద్ద నూతనంగా నిర్మించనున్న స్థలాలను కలెక్టర్ పరిశీలించి పలు సూచనలు చేశారు.

ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో సమీకృత రెసిడెన్షియల్ పాఠశాలల సముదాయం నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించిందని, ఇందులో భాగంగా తొలివిడతలో ఖమ్మం, పాలేరు, మధిర అసెంబ్లీ నియోజకవర్గాల్లో నిర్మాణాలకు చర్యలు చేపడుతున్నట్టు తెలిపారు. పాలేరు నియోజకవర్గానికి సంబంధించి ఖమ్మంరూరల్ మండలం పొన్నెకల్లు వద్ద, ఖమ్మం నియోజకవర్గం రఘునాథపాలెం మండలం జింకలతండా వద్ద, మధిర నియోజకవర్గం సంబంధించి బోనకల్ మండలం లక్ష్మీపురంలో సముదాయాలు నిర్మిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. ఈ నెల 11న సమీకృత గురుకులాలకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి శంకుస్థాపన చేస్తారని తెలిపారు.

11న ఉదయం 9 గంటలకు పాలేరు నియోజకవర్గం, 11 గంటలకు మధిర నియోజకవర్గం, మధ్యాహ్నం 2గంటలకు ఖమ్మం నియోజకవర్గంలో శంకుస్థాపన చేయనున్నట్టు కలెక్టర్ తెలిపారు. ఇందుకోసం విస్తృత ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో కలెక్టర్ వెంట శిక్షణ సహాయ కలెక్టర్ మ్రిణాల్ శ్రేష్ఠ, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ హేమలత, డీఈవో సోమశేఖరశర్మ, అధికారులు పాల్గొన్నారు.

మనసుగతి మారితేనే..

యాంత్రిక జీవనంలో వెంటాడుతున్న ఒత్తిళ్లు

నేడు ప్రపంచ మానసిక ఆరోగ్య దినం

7



శంకుస్థాపన చేస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

డంపింగ్‌యార్డు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి

రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ఖమ్మం సంక్షేమ విభాగం, అక్టోబరు 9: ఖమ్మం నగరంలో డంపింగ్ యార్డు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని, తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించివాటిని డిస్పోజల్ చేయాలని, స్థానికులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం 1వ డివిజన్‌లో డంపింగ్ యార్డు అప్రోచ్ రోడ్డు, అంతర్గత రహదారులకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ డంపింగ్‌యార్డు స్థానికులకు ఇబ్బందిగా మారిందన్నారు. సాలిడ్ మెనేజ్‌మెంట్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఒకే ప్రాంతంలో చెత్తను డంపింగ్ చేయటం ద్వారా పెద్ద సమస్యగా మారిందని ప్రత్యామ్నాయ ఏర్పాట్లు పరిశీలించాలన్నారు. కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, కమిషనర్ అభిషేక్ అగస్త్య, కార్పొరేటర్ తేజావత్ హుస్సేన్ పాల్గొన్నారు.



విజయాలనందించు దేవీ

భద్రాచలం, అక్టోబరు 9: భద్రాచలంలోని శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలో వేంచేసి ఉన్న లక్ష్మీతాయారు అమ్మవారు బుధవారం విజయలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా అమ్మవారికి అభిషేకం నిర్వహించారు. అలాగే సామూహిక కుంకుమార్చన, విశేష దర్బార్‌సేవ, నివేదన, మహామంత్ర పుష్పం, ప్రసాదగోష్ఠి నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళలు విజయలక్ష్మి అమ్మవారిని దర్శించుకున్నారు. కాగా నేడు అమ్మవారు ఐశ్వర్యలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఇదిలా ఉండగా శ్రీసీతారామచంద్రస్వామి వారిని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సమాజంలో అన్నివర్గాల సంక్షేమానికి కృషి చేయాలి

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



స్వర్ణభారతి కల్యాణ మండపంలో ఏసీ హాల్‌ను ప్రారంభిస్తున్న మంత్రి తుమ్మల

ఖమ్మం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): సమాజంలో అన్నివర్గాల సంక్షేమం కోసం కృషిచేయాలని అప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. కమ్మ మహాజన సంఘం ప్రాంగణంలోని స్వర్ణభారతి కల్యాణ మండపంలోని భోజనశాలకు రూ.27లక్షలతో ఏర్పాటుచేసిన ఏసీ హాల్‌ను మంత్రి తుమ్మల బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కమ్మ కులంలోని కొందరు పెద్దలు ఖమ్మంలో కమ్మ హాస్టల్ ఏర్పాటుచేసి అన్ని కులాల పేద విద్యార్థులకు వసతిసౌకర్యం కల్పించారని, వారిస్ఫూర్తిని ముందుకు తీసుకెళ్లాలని విజ్ఞప్తి చేశారు. గత కమ్మ సంఘం ఎన్నికల సందర్భంగా ఎన్నో ఇబ్బందులకు గురిచేసినా వృద్ధులు సైతం సంఘం ఎన్నికల్లో పాల్గొని ఎర్నేని రామారావు కమిటీని గెలిపించారని గుర్తుచేశారు. ఈసారి కూడా సంఘానికి, సమాజానికి ఉపయోగపడే వారిని ఎన్నుకోవాలని, నిజాయితీ, క్రమశిక్షణతో సంఘాన్ని ముందుకు తీసుకెళ్లే వారితో కమిటీ ఎన్నుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మేయర్ పునుకొల్లు నీరజ, నల్లమల వెంకటేశ్వరరావు, కమ్మ సంఘం అధ్యక్షుడు ఎర్నేని రామారావు, దీపక్‌చౌదరి తదితరులు పాల్గొన్నారు.

తపాలా వారోత్సవాల్లో రేపు 'విత్తీయ శశక్తికరణ్ దివస్'

తపాలా సూపరింటెండెంట్ వీరభద్రస్వామి

ఖమ్మం మామిళ్లగూడెం, అక్టోబరు 9: జాతీయ తపాలా దినోత్సవాల్లో భాగంగా శుక్రవారం బాలికా సాధికారతకు ప్రాధాన్యతనిస్తూ విత్తీయ శశక్తికరణ్ దివస్ నిర్వహిస్తున్నట్లు తపాలా సూపరింటెండెంట్ వీరభద్రస్వామి తెలిపారు. జాతీయ తపాలా దినోత్సవం ఉద్దేశ్యం ప్రజలు, వ్యాపారుల రోజువారీ జీవితంలో పోస్టల్ పాత్ర గురించి, సామాజిక, ఆర్థిక అభివృద్ధికి వారి సహకారం గురించి అవగాహన కల్పిస్తోన్నట్లు ఆయన తెలిపారు. ఈ సంవత్సరం జాతీయ తపాలా వారోత్సవాలు దేశం సామాజిక, ఆర్థిక అభివృద్ధిలో భారతదేశ తపాలాశాఖను అభివృద్ధి చెందుతున్న పాత్రకు అనుగుణంగా రూపొందిస్తోన్నట్లు తెలిపారు. ఆడపిల్లపై దృష్టి, ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమాల ద్వారా బాలికా సాధికారతపై ప్రత్యేక దృష్టి. డక్ చౌపాల్ ప్రతి సబ్ డివిజన్ వద్ద మూడు డక్ చౌపల్స్‌ను నిర్వహించనున్నట్లు చెప్పారు. ప్రత్యేక పీఎల్‌ఐ (తపాలా బీమా)సేకరణ డ్రైవ్ నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆయన ఓ ప్రకటనలో ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

బంతిపూల కోసం వెళ్తూ...

(5వ పేజీ తరువాయి)

చదువుతున్నాడు. అతని తండ్రి ప్రభుత్వ టీచర్ కాగా, అతనికి ఒక అన్న ఉన్నాడు. చిన్న కుమారుడు కావడంతో అల్లారుముద్దుగా పెరిగాడు.

అలాగే పాల్వంచ మండలం జగన్నాధపురం గ్రామానికి చెందిన బానోత్ సంతోష్ తన తల్లికి తోడుగా స్థానికంగా ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ నిర్వహిస్తున్నాడు. వీరిద్దరూ స్నేహితులు కావడంతో ఎనిమిది రోజుల క్రితం భవానీ మాలను ధరించారు. లక్ష్మీదేవిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో ఏర్పాటు చేసిన భవానీ మండపంలో భజనలు చేస్తూ బిజీగా ఉన్నారు. ఈ క్రమంలోనే బుధవారం ఉదయం ఇందిరాకాలనీలో భవానీ మాల ధరించిన వ్యక్తి ఇంట్లో పడి పూజకు హాజరయ్యారు. అనంతరం తమ స్నేహితుడు గణేష్ ఆటో తీసుకుని ఫాస్ట్ ఫుడ్ సెంటర్లోకి కావలసిన సరుకులు ఇచ్చి వస్తామని చెప్పి బయలుదేరారు. జగన్నాధపురం వెళ్లి వస్తామని చెప్పిన ఆ ఇద్దరూ.. కొద్దిసేపటి తరువాత ఫోన్ చేస్తే ముఖ్యమైన పని మీద కొత్తగూడెం వచ్చామని చెప్పారు. అనంతరం అక్కడ నుంచి ఆటోలో బయలుదేరిన వారు సాయంత్రం జూలూరుపాడు మండలంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారని తెలుసుకుని వారి స్నేహితులు, భవానీలు కన్నీరు మున్నీరవుతున్నారు. అయితే వారు బంతిపూల కోసం వెళ్లారా... మరేదైనా పని నిమిత్తం వెళ్లారా.. అనేది తెలియడం లేదు.

వరి పైర్లలో ఎలుకల బెడద

వాటి నిర్మూలనకు రూ.వేలు ఖర్చుచేస్తున్నరైతులు

వేంసూరు, అక్టోబరు 9: వానాకాలం సీజన్‌లో మండలంలోని పలువురు రైతులు వేలాది ఎకరాల్లో వరి పంటను సాగుచేశారు. ప్రస్తుతం వరిపైరు పొట్టదశలో ఉంది. మొన్నటివరకు తెగుళ్ల నివారణకు రైతులు రూ.వేలాది ఖర్చు చేసి పురుగుల మందులను పిచికారి చేసి పంటలను కొంతమేర కాపాడుకొన్నారు. ప్రస్తుతం వరిపైరులో ఎలుకల బెడద ఎక్కువగా కావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వేంసూరు, కందుకూరు, రామన్నపాలెం, మర్లపాడు, భీమవరం, రాయుడుపాలెం తదితర గ్రామాల్లో రైతులు తమ వరిపంటను కాపాడుకొనేందుకు పడరాని పాట్లు పడుతున్నారు. ఎలుకలను నిర్మూలించేందుకు రూ.వేలాది ఖర్చుచేయాల్సిన దుస్థితి నెలకొందని రైతులు పేర్కొంటున్నారు. ఎలుకలను నిర్మూలించేందుకు ఏపీలోని నెల్లూరు జిల్లాకు చెందిన కొందరు మండలానికి వచ్చి ఇక్కడే డేరాలు వేసుకొని ఉంటున్నారు. వరిపైర్లలో ఎలుకల నిర్మూలనకు రూ.వెయ్యి తీసుకొని వంద బుట్టలను ఏర్పాటు చేస్తున్నారు. రోజులో ఎలుకలు పడినా పడకపోయినా రూ.వెయ్యి చెల్లించాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు.



వరిపైరులో ఎలుకల నిర్మూలనకు బుట్టలు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

ప్రకృతిని పూజించే గొప్ప సంస్కృతి మనది

భద్రాద్రి ఎస్పీ రోహిత్ రాజ్



బతుకమ్మ వేడుకలను ప్రారంభిస్తున్న ఎస్పీ రోహిత్‌రాజు

కొత్తగూడెం సాంస్కృతికం, అక్టోబర్ 9: ప్రకృతిని పూజించే గొప్ప సంస్కృతి తెలంగాణ ప్రజలదని, బతుకమ్మ వేడుకల్లో మహిళలందరూ ఉత్సాహంగా పాల్గొనడం ఆనందాన్నిస్తుందని ఎస్పీ రోహిత్‌రాజు అన్నారు. బుధవారం కొత్తగూడెంలోని జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్ ఏర్పాటుచేసిన బతుకమ్మ సంబరాలను ఎస్పీ ప్రారంభించి మాట్లాడారు. దుర్గాదేవి అమ్మవారి ఆశీస్సులతో జిల్లా ప్రజలందరి జీవితాల్లో వెలుగులు నిండాలని ఆయన ఆకాంక్షిస్తూ జిల్లా ప్రజలకు సద్దులబతుకమ్మ, దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఈ బతుకమ్మ వేడుకల్లో పోలీసు శాఖలో మహిళలు, పోలీసు కుటుంబాలు పాల్గొని ఆటపాటలతో సందడిచేశారు. తెలంగాణ సంస్కృతి,సంప్రాదాయలకు అద్దం పట్టేలా తీరొక్క పూలతో భారీ బతుకమ్మలను పేర్చి ఆటపాటలతో హోరెత్తించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ టి.సాయి మనోహర్, ఇల్లెందు డీఎస్పీ చంద్రభాను, కొత్తగూడెం డీఎస్పీ రెహమాన్, పాల్వంచ డీఎస్పీ సతీష్ కుమార్, మణుగూరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి, ఏఆర్ డీఎస్పీ సత్యనారాయణ, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు

ఎంఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో నల్లజెండాలతో నిరసన



ర్యాలీ నిర్వహిస్తున్న ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ నాయకులు

ఖమ్మం చర్చికాంపౌండ్, అక్టోబరు 9: డీఎస్సీ ఉద్యోగ నియామకాల్లో ఎస్సీ వర్గీకరణ అమలుచేయకుండా ముఖ్యమంత్రి మాదిగలకు ఇచ్చినమాట తప్పిన తీరుకు నిరసనగా ఎంఆర్‌పీఎస్, ఎంఎస్పీ ఆధ్వర్యంలో బుధవారం ఖమ్మం నగరంలోని అంబేద్కర్ విగ్రహం నుంచి బాబూ జగ్జీవన్‌రాం విగ్రహం వరకు నల్లజెండాలతో నిరసన ర్యాలీ నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ లేకుండా చేపట్టిన డీఎస్సీ ఉద్యోగ ప్రక్రియను నిలిపివేయాలని ఆర్డినెన్సు ద్వారా వర్గీకరణ అమలు చేసి, డీఎస్సీని పునరుద్ధరించాలని కోరారు. అసెంబ్లీలో ముఖ్యమంత్రి ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలన్నారు. వెంటనే డీఎస్సీని రద్దుచేయాలని కోరారు. లేనిచో మాదిగల తిరుగుబాటు తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్‌పీ జాతీయ నాయకుడు ఏపూరి వెంకటేశ్వరరావు, ఎంఎస్‌పీ రాష్ట్ర నాయకులు బచ్చలకూర వెంకటేశ్వరావు ఖమ్మంజిల్లా అధ్యక్షుడు తూరుగంటి అంజయ్య, కూరపాటి సునీల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



కలెక్టర్, సీపీలతో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల

ఖమ్మం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఖమ్మం విద్యారంగానికి గుమ్మంగా ప్రభుత్వం తీర్చిదిద్దుతుందని అధిక ప్రాధాన్యత ఇస్తుందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. మంత్రి తుమ్మల క్యాంపు కార్యాలయంలో బుధవారం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, సీపీ సునీల్‌దత్‌తో సమావేశాన్ని నిర్వహించారు. ఖమ్మాన్ని విద్యారంగంలో అభివృద్ధి చేసే లక్ష్యంతో ముందుకు పోతున్నామని పేర్కొన్నారు. దీనిలో భాగంగా 22 ఎకరాల్లో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ మంజూరు చేసినట్లు తెలిపారు. ఈనెల 11న శంకుస్థాపనకు అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. రఘునాథపాలెం మండలం జింకల తండాలో ఈ పాఠశాల నిర్మాణం జరుగుతుందన్నారు. ఖమ్మం నియోజకవర్గంలో 50 మసీదులకు రూ. 50లక్షల నిధులు తక్షణమే కేటాయించాలని కలెక్టర్‌కు సూచించారు. అక్షయ పాత్ర ఫౌండేషన్‌కు త్వరితగతిన భూమిని కేటాయించాలని ఆదేశించారు. మైనింగ్ అక్రమాలపై, గంజాయిపై నిఘా పెంచాలని సీపీ సునిల్‌దత్‌కు ఆదేశించారు. శాంతిభద్రతల పరిరక్షణకు చర్య లు చేపట్టాలన్నారు. జిల్లాలో అధికారులు సమన్వయంతో పనిచేయాలని మంత్రి తుమ్మల ఆదేశించారు.

ప్రతి హామీని నెరవేరుస్తాం..

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



నారాయణపురంలోని తన వ్యవసాయ క్షేత్రంలో వరి పొలాన్ని పరిశీలిస్తున్న మంత్రి పొంగులేటి

ఖమ్మం రూరల్/కల్లూరు, అక్టోబరు 9: ఇందిరమ్మ రాజ్యంలో పేదలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తామని రెవెన్యూ, గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఖమ్మం రూరల్ మండలంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో బుధవారం లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను ఎంపీ రఘురాంరెడ్డితో కలిసి మంత్రి పొంగులేటి అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ పేదల సంక్షేమానికి పాటుపడుతూనే హామీల అమలుకు కృషి చేస్తున్నామని తెలిపారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా ఇచ్చిన హామీలను ఒక్కొక్కటి అమలు చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్టు తెలిపారు. ఆరుగ్యారంటీల్లో సగానికిపైగా అమలు చేసి చూపించామని పేర్కొన్నారు. గత ప్రభుత్వం కంటే కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు అనేక అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతోందన్నారు. గత ప్రభుత్వం చేయని విధంగా రైతులకు రుణమాఫీ చేసి చూపించామని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ఇరిగేషన్ అభివృద్ధి సంస్థ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు, ఆర్‌డీవో గణేష్, తహసీల్దార్ రాంప్రసాద్, జిల్లా నాయకులు బాలసాని లక్ష్మీనారాయణ, మద్దినేని స్వర్ణకుమారి, వెంకటరెడ్డి, హరినాధబాబు, మహేష్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం జిల్లా కల్లూరు మండలంలోని తన స్వగ్రామమైన నారాయణపురంలో తన వ్యవసాయక్షేత్రాన్ని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి బుధవారం స్థానిక రైతులతో కలిసి పరిశీలించారు. ఉదయం 5-30 నిమిషాలకు మంత్రి పొంగులేటి తన నివాసం నుంచి కాలినడకన బయలుదేరి వ్యవసాయ క్షేత్రానికి చేరుకొని పొట్టదశకు వచ్చిన వరి పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక రైతులతో ముచ్చటించి వరి సాగు వివరాలను అడిగి తెలుసుకున్నారు. సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి సూచనలు చేశారు. మంత్రి వెంట స్థానిక కాంగ్రెస్ నాయకుడు అంకిరెడ్డి సత్యనారాయణరెడ్డి, రైతులు రామకృష్ణ, శ్రీను, శివ, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

పోయి రావమ్మా బతుకమ్మా!

ఖమ్మం సాంస్కృతికం/కొత్తగూడెం సాంస్కృతికం, అక్టోబర్ 9: సద్దుల బతుకమ్మను ఘనంగా జరుపుకునేందుకు మహిళలు అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. ఉత్సవంలో భాగంగా తొమ్మిదో రోజున బతుకమ్మను సద్దుల బతుకమ్మగా కొలుస్తూ సాగనంపుతారు. ఎనిమిది రోజుల పాటుస్థానికంగా ఆలయాల్లో, బావులు, తదితర చిన్న జల వనరుల వద్ద బతుకమ్మను వదిలిన మహిళలు, చివరి రోజున నదులు, ఏర్లు, చెరువులు వంటి పెద్దతరహా జలవనరుల్లో బతుకమ్మను నిమజ్జనం చేస్తారు. ఇందులో భాగంగా నగరంలోని మహిళలంతా బతుకమ్మలను ఎత్తుకొని ఒక్కచోటకు చేరతారు. బతుకమ్మలను చేత పట్టుకొని, రిక్షాల్లో, ఆటోల్లోపెట్టుకొని మున్నేటి తీరానికి చేరతారు. బతుకమ్మలను ఆడే యువతులు, మహిళలతోపాటు వృద్ధులు, చిన్నారులు సైతం ఎంతో ఆసక్తిగా పాల్గొంటారు. బతుకమ్మలను కిందకు దింపి భక్తి పాటలుపాడుతూ గౌరమ్మను పూజిస్తూ నీళ్లలో సాగనంపుతారు. వేలాది మంది బతుకమ్మలను ఆడే వారితోపాటు వారితో వచ్చే వారు ఉత్సవాలను తిలకించేందుకు వచ్చే వారితో మరికొన్ని వేలమంది ఒక్కచోటుకు చేరతారు. దీంతో తిరునాళ్ల వాతావరణం ఏర్పడుతుంది.

మహిళలు సద్దుల బతుకమ్మలను నిర్వహించుకునేందుకు మునిసిపల్ కార్పొరేషన్, పోలీస్ తదితర శాఖల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. ఉత్సవం నిర్వహించే మున్నేటి తీరం వెంట శుభ్రం చేసి విద్యుత్, మంచినీరు తదితర సదుపాయాలు కల్పించారు. నిమజ్జనం సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీస్ శాఖ సిబ్బందిని నియమించింది. తెలంగాణ సంస్కృతి సంప్రదాయానికి చిహ్నమైన బతుకమ్మను ఖమ్మం నగరంతోపాటు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సంబురంగా నిర్వహిస్తున్న విషయం విదితమే.. సంప్రదాయ పాటలు, నృత్యాలతోపాటు డీజే సప్పుళ్లతో హుషారుగా పండుగను జరుపుతున్నారు. నగరంలోని ఆలయాలు, వివిధ కూడళ్లతోపాటు అపార్ట్‌మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీల్లో సైతం సంప్రదాయ బతుకమ్మలను పేర్చి ఆడుతున్నారు. ఎంగిలి పూల బతుకమ్మగా మొదటి రోజున జోష్‌తో నిర్వహించిన మహిళలు గత ఎనిమిది రోజులుగా అదే ఉత్సాహాన్ని చూపుతున్నారు. ప్రతిరోజు సాయంత్రం నుంచి రాత్రి వరకు బతుకమ్మ ఆటపాట కార్యక్రమం జరుగుతోంది.

కొత్తగూడెంలో....

సద్దుల బతుకమ్మ సంబరాలను గురువారం ఘనంగా జరుపుకొనేందుకు భద్రాద్రిజిల్లా వ్యాప్తంగా ఆడపడుచులు సిద్ధమయ్యారు. ఇందుకోసం సుదూర ప్రాంతాలనుంచి తమ సొంత ఊళ్లకు బంధుమిత్రులు, మహిళలు చేరుకున్నారు. భద్రాద్రి జిల్లా కేంద్రమైన కొత్తగూడెంలో ముర్రేడు ఘాట్, గోధుమవాగు, రుద్రంపూర్‌లోని ధన్‌బాద్ చెరువులతోపాటు సుజాతనగర్‌లోని చెరువుల్లో బతుకమ్మలను నిమజ్జనం చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. శ్రీనగర్‌లోని ముర్రేడు ఘాట్ వద్ద ఉత్సవ కమిటీ, శ్రీనగర్ పంచాయతీ ఆధ్వర్యంలో సద్దుల బతుకమ్మకు విస్తృత ఏర్పాట్లు చేశారు. పంచాయతీ సెక్రటరీ లక్ష్మయ్య, ఉత్సవకమిటీ నిర్వాహకులు, కాంగ్రెస్‌పార్టీ నాయకులు కోనేరు సత్యనారాయణ, పూర్ణచందర్‌రావు, భద్రమ్మ, లక్ష్మణ్, మాజీ ఉపసర్పంచ్ లగడపాటి రమేష్, తదితరులు బుధవారం ఏర్పాట్లను పరిశీలించారు.

అభివృద్ధి పనులు పది కాలాల పాటు ఉపయోగపడాలి

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



జింకలతండాలో సమీకృత గురుకుల భవన స్థలాన్ని పరిశీలిస్తున్న మంత్రి తుమ్మల

ఖమ్మం సంక్షేమవిభాగం/ రఘునాథపాలెం, అక్టోబరు 9: ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి పనులు పది కాలాలపాటు ప్రజలకు ప్రయోజనకరంగా ఉండాలని, భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని రహదారుల నిర్మాణాలు జరపాలని, అంతర్గత రహదారులైనా నాణ్యతతో చేపట్టాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. ఖమ్మం నగరంలోని 20వ డివిజన్‌లో రూ.50లక్షల సీసీ రహదారులకు బుధవారం మంత్రి తుమ్మల శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖమ్మం నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

అనంతరం మంత్రి తుమ్మల రఘునాథపాలెంలో గిరిజన గ్రామ పంచాయతీల్లో పర్యటించి శంకుస్థాపనలు చేశారు. గిరిజన మహిళలు మంత్రికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అర్హత కలిగిన లబ్ధిదారులకు ఇందిరమ్మ ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు అందుతాయ ని హామీ ఇచ్చారు. స్థానిక అధికారులు ఎప్పటికప్పుడు గ్రామా ల్లో సర్వే నిర్వహించి నిర్విరామంగా లబ్ధిదారుల జాబితాలను గుర్తించి తనకు తెలియజేయాలని ఆదేశించారు. ఇళ్లు లేని వారికి, గుడిసెలు, రేకులషెడ్‌లో ఉన్న వారిని గుర్తించాలని ఆటువంటి పేదలకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మాణం చేసి ఇస్తామన్నారు.

అనంతరం రాష్ట్ర ప్రభుత్వం త్వరలో ప్రవేశపెట్టనున్న సమీకృత గురుకులం సంక్షేమ భవనాల సముదాయానికి జింకల తండాలో అధికారులు గుర్తించిన ప్రభుత్వస్థలాన్ని మంత్రి పరిశీలించారు. రాష్ట్రంలోనే మోడల్ సమీకృత గురుకులాల భవన్ జింకలతండాలోనే నిర్మాణం జరిగే విధంగా ఆట స్థలాలకు అనుకూలంగా స్థలాన్ని గుర్తించాలన్నారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మేయర్ పునుకొల్లు నీరజ, కమిషనర్ అభిషేక్ అగస్త్య, కార్పొరేటర్లు ప్రశాంతలక్ష్మి, పాలెపు విజయవెంకటరమణ, కమర్తపు మురళి, మలీదు జగన్ తదితరులు పాల్గొన్నారు.

సన్నధాన్యంతో సవాలే...

(5వ పేజీ తరువాయి)

జిల్లా స్థాయి వరకు వ్యవసాయాధికారులు పకడ్బందీగా వ్యవహరించి జిల్లాలో సన్నధాన్యం పండించిన రైతులు, ఉత్పత్తి గణాంకాలను సేకరించి నిఘా పెట్టాల్సి అవసరం ఉంది. వ్యవసాయ అధికారులు నిర్ధారణ జాబితాలు ఎంత పకడ్బందీగా తయారు చేసినా ధాన్యం తక్కువ పండిన రైతుల పేరుపై ఏపీకి చెందిన సన్నధాన్యాన్ని ఇక్కడి కొనుగోలు కేంద్రాల్లో విక్రయించే అవకాశం ఉంది. అదే జరిగితే ప్రభుత్వం ప్రకటించిన బోనస్‌సొమ్ము దుర్వినియోగమయ్యే అవకాశం ఉంది.

నిఘా పకడ్బంధీగా ఉండాలి..

ఏపీతో ఉమ్మడి ఖమ్మం జిల్లాకు అనేక చోట్ల సరిహద్దు రహదారులున్నాయి. ఆయా రహదారుల్లో చెక్‌పోస్టులు, విజిలెన్స్ బృందాలను ఏర్పాటు చేశామని అధికారులు చెబుతున్నారు. ఖమ్మం జిల్లా పరిధిలో 14 నిఘా బృందాలను ఏర్పాటు చేశారు. అయినా రెండు తెలుగు రాష్ట్రాల మధ్య ప్రధాన రహదారులే కాకుండా అనేక డొంకరోడ్లు ఉన్నాయి. ఆయా రోడ్లనుంచి సరిహద్దు గ్రామాల రైతుల పేర్లతో ధాన్యం విక్రయించే అవకాశాలు అధికంగా ఉన్నాయి.

ఖమ్మం జిల్లా పరిధిలో 322 ధాన్యం కొనుగోలు కేంద్రాలు అధికారులు ఏర్పాటు చేయగా 4.26లక్షల మె.ట. ధాన్యం కొనుగోలు చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 165కొనుగోలు కేంద్రాల ద్వారా 3లక్షల మె.ట ధాన్యం కొనుగోలు చేయాలని నిర్ణయించారు. దసరా అనంతరం దశలవారీగా కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాబోతున్నాయి. గతంలో ధాన్యం కొనుగోళ్లలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తలేదు. కానీ ఈసారి బోనస్ ప్రకటన నేపథ్యంలో ఏపీ ప్రాంతాలనుంచి ఉమ్మడి జిల్లాకు ధాన్యం అక్రమంగా తరలివచ్చే అవకాశం ఉంది. దీనిపై నిఘా పెంచకపోతే బోనస్ సొమ్ము దుర్వినియోగం అయ్యే అవకాశం ఉంది.

అత్తింటి వేధింపులపై పోలీసులకు కోడలి ఫిర్యాదు

ఆందోళనతో భర్త, అత్తామామల ఆత్మహత్యాయత్నం

చుంచుపల్లి, అక్టోబరు 9: అదనపు కట్నం కోసం తనను భర్త, అత్తామామలు వేధిస్తున్నారని ఓ యువతి పోలీస్‌స్టేషన్ మెట్లెక్కింది. వారం రోజుల క్రితం లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసింది. సీన్ కట్ చేస్తే.. కోడలి ఫిర్యాదుతో ఆందోళనకు గురైన ముగ్గురూ నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఈ సంఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. బాధితురాలి ఫిర్యాదులో తెలిపిన వివరాలు ఇలా వున్నాయి...

ఈ ఏడాది ఫిబ్రవరి నెలలో భద్రాద్రి జిల్లా చుంచుపల్లి మండలానికి చెందిన ఓ యువతికి హైదరాబాద్ నాగోలు ప్రాంతానికి చెందిన తోట భావనారాయణ, పద్మావతిల ఏకైక కుమారుడు సుజన్‌తో వివాహం జరిగింది. సుజన్ హైదారాబాద్‌లో ఓ ప్రైవేటు కంపెనీలో మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. పెళ్లి సమయంలో యువతి తల్లిదండ్రులు రూ.30 లక్షల కట్నంతోపాటు రూ.6లక్షల విలువైన ఆభరణాలు, గృహోపకరణాలను అందజేశారు. అయితే పెళ్లయిన కొద్దిరోజులకే యువతికి వేధింపులు మొదలయ్యాయి. 'నల్లగా ఉన్నావు.. మరో రూ.20 లక్షలు కట్నంగా తీసుకురా..' అంటూ భర్త, అత్తామామలు తనను వేధిస్తున్నారని తల్లిదండ్రుల దృష్టికి తీసుకువెళ్లింది. ఆ తర్వాత కూడా వేధింపులు ఆగలేదని, మూడు నెలల గర్భాన్ని సైతం బలవంతంగా తీసివేయించారని పేర్కొంది. మెట్టినింట వేధింపులు భరించలేని స్థితికి చేరడంతో పుట్టింటికి చేరి ఇక్కడే ఉంటోంది. రోజులు గడుస్తున్నా మెట్టినింటి నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో సదరు యువతి న్యాయం కోరుతూ ఈ నెల 2న చుంచుపల్లి పోలీసులను ఆశ్రయించింది.

అయితే తన భార్య పోలీసులకు ఫిర్యాదు చేసిందని తెలుసుకున్న సుజన్... తల్లిదండ్రులతో కలిసి ఇంటికి తాళం వేసి వెళ్లిపోయారు. అనంతరం సికింద్రాబాద్‌లోని మహంకాళి పోలీస్‌స్టేషన్ పరిధిలోని హోటల్‌లో గదిని అద్దెకి తీసుకున్నారు. మంగళవారం వారి గది తలుపులు ఎంతకీ తెరవకపోవడంతో హోటల్ యాజమాన్యం పోలీసులకు సమాచారం అందించింది. తలుపులు పగులగొట్టి చూడగా సుజన్, అతడి తల్లిదండ్రులు అపస్మారక స్థితిలో కనిపించారు. దీంతో వెంటనే వారిని గాంధీ ఆస్పత్రికి తరలించారు. నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఉంటారని అనుమానిస్తున్నారు. ప్రస్తుతం వారి పరిస్థితి విషమంగా వున్నట్టు తెలిసింది.

ఇదిలావుండగా, సోమవారం సుజన్, అతడి తల్లిదండ్రులు.. యువతికి ఫోన్ చేసి కేసు ఉపసంహరించుకోవాలని కోరినట్టు తెలిసింది. అయితే పెళ్లయిన నాటి నుంచి వేధింపులకు గురిచేయడం నిత్యకృత్యంగా మారడంతో యువతి కేసు ఉపసంహరణకు నిరాకరించినట్టు తెలిసింది. దీంతో పోలీసులు అరెస్టు చేస్తారనే భయంతో ముగ్గురూ ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్టు తెలిసింది.

బతుకమ్మ పూల కోసం వెళ్లి వ్యక్తి మృతి


ఐలయ్య(ఫైల్)

అశ్వాపురం, అక్టోబరు 9: బతుకమ్మ పూల కోసం చెరువులోకి వెళ్లి వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం మండల పరిధిలోని జగ్గారం గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జగ్గారం గ్రామానికి చెందిన నున్న ఐలయ్య(38) బతుకమ్మ పూలకోసం గ్రామ సమీపంలోని ఊర చెరువుకు వెళ్లాడు. చెరువులో కలువ పూలు కోసేందుకు లోతైన ప్రదేశానికి వెళ్లడంతో, ప్రమాదవశాత్తూ అందులో మునిగిపోయాడు. గమనించిన తోటి వారు రక్షించే లోపే మృతి చెందాడు. కాగా మృతుడు మణుగూరు ఆర్టీసీలో హమాలీగా పనిచేస్తున్నాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జామాయిల్ వాహనాల పట్టివేత

భద్రాచలం, అక్టోబరు 9: భారీ లోడుతో వెళ్తున్న జామాయిల్ వాహనాలను బూర్గంపాడు మండలం ముసలిమడుగు వద్ద బుధవారం రవాణాశాఖ అధికారులు పట్టుకున్నారు. ఈ సందర్భంగా మూడు ట్రాక్టర్లను పట్టుకుని భద్రాచలం ఆర్టీసీ డిపో ప్రాంగణానికి తరలించినట్లు రవాణా శాఖ అధికాకారి మనోహర్ తెలిపారు.

గౌరారంలో టేకు కలప....

దుమ్ముగూడెం అక్టోబరు 9: దుమ్ముగూడెం అటవీరేంజి పరిధి గౌరారంలో బుధవారం ఫర్నీచర్ తయారీకు సిద్ధంగా ఉన్న రూ.40వేల విలువగల టేకు కలప ముక్కలు, రెండు కోత యంత్రాలను అటవీశాఖ అధికారులు దాడిచేసి పట్టుకున్నారు. పట్టుబడిన కలప, యంత్రాలను భద్రాచలం రేంజి కార్యాలయానికి తరలించారు. తనిఖీల్లో ఎఫ్‌డీవో సుజాత, రేంజి అధికారి కమల, సిబ్బంది శ్రీనివాస్, నందా, ఆదినారాయణ, జ్యోత్స్న ఉన్నారు.

50 క్వింటాళ్ల రేషన్ బియ్యం...

కల్లూరు, అక్టోబరు 8: అక్రమంగా తరలిస్తున్న 50 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని కల్లూరులో పోలీసులు పట్టుకున్నారు. వివరాల ప్రకారం..స్థానిక పోలీసులకు అందిన సమాచారం మేరకు వాహనాల తనిఖీ చేస్తుండగా ఏపీ-39, యూహెచ్ 9514 నెంబర్ గల వ్యాన్‌లో 50 క్వింటాళ్ల బియ్యాన్ని అక్రమంగా రవాణా జరుగుతున్నట్లుగా గుర్తించారు. దీంతో వ్యాన్‌తో పాటు సదరు బియ్యాన్ని స్వాధీన పరుచుకుని స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వ్యాన్ డ్రైవర్ పరిగడుపు గోపాలకృష్ణ, కాజ రామారావు, జంగా నరిసింహారెడ్డిలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ యస్‌కే షాకీర్ తెలిపారు.

నెమలిని రక్షించిన రైతులు


నెమలిని ఫారెస్ట్ అధికారులకు అప్పగిస్తున్న రైతులు

చండ్రుగొండ, అక్టోబరు9: అడవి వదిలి పంట పొలాల్లో అపస్మారక స్థితిలో ఉన్న నెమలిని కాపాడి అటవీ శాఖ అధికారులకు అప్పగించిన ఘటన బుధవారం మండలంలోని గురాయిగూడెంలో చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. గురాయిగూడెం గ్రామానికి చెందిన చీదర ప్రసాద్, నరసింహరావు మంగళవారం సాయంత్రం పత్తి చేనులో పనిచేసేందుకు వెళ్లాడు. ఈ సమయంలో పొలంలో అపస్మారక స్థితిలో నెమలి ఉండటాన్ని గమనించిన ఇరువురు రైతులు ఇంటికి తీసుకువచ్చారు. పొలంలో పిచికారి చేసిన పురుగుల మందు వల్లే నెమలి అపస్మారక స్థితికి చేరిందని భావించిన రైతులు ఉపశమనం చర్యలు నిర్వహించారు. బుధవారం ఉదయం అటవీ అధికారులకు సమాచార ఇవ్వడంతో బీట్ ఆఫీసర్ జాన్ ప్రదీప్ రైతుల వద్ద నుంచి నెమలిని తీసుకున్నారు. చికిత్స అనంతరం అటవీ అధికారులు నెమలిని అడవిలోకి వదిలివేశారు. కాగా జాతీయ పక్షి అయిన నెమలిని రక్షించిన ఇరువురు రైతును అటవీ అధికారులు, గ్రామస్థులు అభినందించారు.

కొనసాగుతున్న పారిశుధ్య కార్మికుల సమ్మె


కాంట్రాక్టు కార్మికులు ఆస్పత్రి వద్ద సమ్మె నిర్వహిస్తున్న దృశ్యం

ఖమ్మం కలెక్టరేట్, అక్టోబరు9: జిల్లా జనరల్ ఆస్పత్రిలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు జీతాల కోసం చేస్తున్న సమ్మె బుధవారం నాటికి మూడో రోజుకి చేరుకుంది. గత మూడు నెలల వేతనాలు ఇవ్వాలంటూ ఆసుపత్రి ఆవరణలో సమ్మె బాట పట్టారు. ఇటు కాంట్రాక్టర్‌కు ప్ర భుత్వం కార్మికుల వేతనాలు చెల్లించక పోవడంతో కార్మికులకు జీతాలు ఇవ్వలేక పోతున్నామని కాంట్రాక్టర్ చెబుతుండగా, తాము పనిచేసి పండుగ సమయంలోనూ పస్తులుండాల్సి వస్తోందని కార్మికులు వాపోతున్నారు. మూడు రోజుల నుంచి పారిశుధ్య కార్మికులు సమ్మె చేయడంతో ఆసుపత్రిలో పారిశుధ్యం పేరుకుపోయింది. వార్డుల్లో ఎక్కడ చెత్త చెదారం నిండుకుండడంతో పరిసరాలన్నీ దుర్వాసన వెదజల్లుతోంది. వైద్యం కోసం వచ్చే రోగులకు ఓపీలో సిబ్బంది లేకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమ్మె విరమించాలని రెండు రోజుల్లో వేతనాలు అందిస్తామంటూ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎల్. కిరణ్‌కుమార్ కార్మికులకు నచ్చజెప్పినప్పటికీ వారు సమ్మెను విరమించడం లేదు. ఇదే విషయాన్ని జిల్లా కలెక్టర్‌తో పాటు డీఎంఈ అధికారులకు పరిస్థితిని వివరించారు. దీంతో ఆసుపత్రిలో పారిశుధ్య పనుల కోసం తాత్కాలికంగా మునిసిపల్ కార్మికులను పిలిపించి పనులను చేయాలని అధికారులు ఆదేశించడంతో మునిసిపల్ పారిశుధ్య కార్మికులు బుధవారం ఆస్పత్రికి వచ్చారు. దీంతో సమ్మెలో ఉన్న కార్మికులు కోపోద్రిక్తులయ్యారు. మునిసిపల్ కార్మికులను అడ్డుకున్నారు. వారితో వాగ్వాదనకు దిగారు. దీంతో అక్కడ ఘర్షణ వాతావరణం నెలకొంది. పోలీసులు అక్కడికి చేరుకుని శాంతింపజేశారు. కాంట్రాక్టర్ జీతాలు ఇచ్చే దాకా విధుల్లోకి వచ్చేది లేదని కార్మికులు భీష్మించుకు కూర్చున్నారు.

సరస్వతీ దేవి అలంకరణలో అమ్మవారు


సరస్వతీ దేవి అలంకారంలో అమ్మవారు

ఖమ్మం సాంస్కృతికం, అక్టోబరు 9: దేవీ నవరాత్రులు ముగింపునకు చేరుతుండటంతో అన్ని చోట్లా హోమాలు, పూజలు, అన్నప్రసాద వితరణలు చేపట్టారు.. దీంతో బుధవారం పలు చోట్ల ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. అన్నదానాలు, కుంకుమపూజల నిర్వహణ కోసం స్థానిక వీధులకు అడ్డుగా షామియానాలు వేయటంతో స్థానికులు కొంత మేర ఇబ్బందులు పడ్డారు. దేవీ నవరాత్రులు మరో రెండు రోజులు మాత్రమే ఉండటంతో సంబురాలు నగరంలో అంబరాన్నంటుతున్నాయి.. వేదికల వద్ద ఆధ్యాత్మిక కార్యక్రమాలు జోరుగా సాగుతున్నాయి. స్తంభాద్రి లక్ష్మీ నరసింహస్వామి దేవాలయంలో అమ్మవారికి సరస్వతిదేవి అలంకారం నిర్వహించారు. పలు చోట్ల పలు రూపాల్లో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.

మనసుగతి మారితేనే..



శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యం కూడా ముఖ్యమే

- యాంత్రిక జీవనంలో వెంటాడుతున్న ఒత్తిళ్లు
- చికిత్స పొందాలంటున్న వైద్యులు
- నేడు ప్రపంచ మానసిక ఆరోగ్య దినం

ఖమ్మం కలెక్టరేట్, అక్టోబరు 9: శారీరంగా గాను, మానసికంగాను బాగుంటేనే.. సంపూర్ణ ఆరోగ్యం ఉన్నట్టు. కానీ చాలా మంది శారీరక ఆరోగ్యం చాలని భావిస్తున్నారు. కుర్రాడి నుంచి వృద్ధుడి వరకు ఏదో ఒక రూపంలో మానసికంగా కుంగిపోవడం సాధారణమైంది. దీన్ని తొలి దశలోనే తుంచి వేయాలని నిపుణులు సూచిస్తున్నారు. నేడు ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం...!

రెండేళ్ల క్రితం కరోనా మహమ్మారి జనాన్ని పట్టిపీడించింది. విద్యార్థులు, చిన్నలు, పెద్దలు, వృద్ధులు ఇలా అన్ని వర్గాల వారు ఇంటికే పరిమితమయ్యారు. అదే సమయంలో తమ ఆప్తులను కోల్పోయారు. ఇప్పటికీ అనారోగ్య సమస్యలతో పాటు మానసిక వ్యాకులత వేధిస్తోంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాల్లో ఎంతో మంది మానసిక రుగ్మతలతో కుములిపోతున్నారు. కుటుంబంలో వివిధ రకాల సమస్యలు, ఆర్థిక, అనారోగ్య బాధలు, పని ఒత్తిడి ఇతర కారణాలతో సతమతమయ్యే వారు పెరుగుతున్నారు. అతిగా ఆలోచించడం, చిన్నపాటి విషయానికే ఉద్వేగానికి లోనవడం జాడ్యంగా మారుతోంది దీనికి ఆదిలోనే కట్టడి చేయాల్సిన బాధ్యత ఎవరికి వారుగా తీసుకోవాలి.

- ఏదో ఒక కారణంతో..

దేశంలో ప్రతి 22 మందిలో ఒకరికి తీవ్రమైన మానసిక వ్యాధి ఉందని ప్రపంచ ఆరోగ్యసంస్థ చెబుతోంది. ఆత్మహత్యల్లో ప్రతి ఐదుగురిలో ఒకరికి మానసిక ఒత్తిడి కారణమవుతోంది. ఏదో ఒక పోబియాతో మృతి చెందే వారు పెరుగుతున్నారు. ఆత్మహత్య చేసుకుంటున్న వారిలో 15 ఏళ్ల నుంచి 24 ఏళ్లున్న వారు అధికంగా ఉంటున్నారు.

- సెల్‌ఫోన్‌తో తంటాలు

కరోనా నుంచి అన్ని వర్గాల ప్రజలు సెల్‌ఫోన్ వినియోగం తీవ్రస్థాయికి పెరిగింది. కరోనా పరిస్థితుల్లో ఎక్కువ శాతం అలవాటుపడిన తీరు వ్యసనంలా మారింది. బాలలు, విద్యార్థులు, యువత ఎక్కువగా వీక్షిస్తున్నారు. సామాజిక మాధ్యమాలకు బానిసగా మారుతున్నారు. దీంతో నిద్ర లేమి వేదిస్తోంది. ఫలితంగా లక్ష్యాలు పెడదారి పడుతున్నాయి. మానసిక వ్యధ, ఒత్తిడి, ఆందోళనలు ఎదుర్కొంటున్నారు. ఆటలు, ఆహారం, వ్యాయామం కరవై ఇక్కట్లు పడుతున్నారు.. మద్యపానానికి బానిసలుగా మారుతున్నారు.

ఆందోళన చెందొద్దు



డాక్టర్ కంభంపాటి నారాయణరావు, సైకియాట్రిస్ట్, ఖమ్మం

జీవితంలో ఏదో ఒక దశలో మానసిక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుంది. కుమిలిపోయి. సమస్యను జటిలం చేసుకోవద్దు. పరిష్కార మార్గాలను అన్వేషించాలి. ఆలోచనా తీరులో మార్పు రాకుంటే సైకిలజిస్టు లేదా సైక్రియాటిస్టును ఆశ్రయించాలి. పిల్లల ప్రవర్తనను ఎప్పటికప్పుడు గమనించాలి. చాలామంది మానసిక సమస్యలతో బాధపడుతున్నప్పటికీ, వైద్యులను సంప్రదించడం లేదు. డిప్రెషన్ బాధితుల్లో మూడింట ఒక వంతు మందే చికిత్స పొందుతున్నారు. కాబట్టి, మానసిక ఆరోగ్యం పట్ల అవగాహనను పెంపొందించుకోవాలి. బాధితులందరికీ చికిత్స, కౌన్సెలింగ్‌ను అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఉంది.

రైతులకు మేలు జరిగేలా పవర్ ప్లాంట్ నిర్మాణం

- 12న మంత్రి తుమ్మలచే పవర్ ప్లాంట్ ప్రారంభోత్సవం
- ఎమ్మెల్యే జారే ఆదినారాయణ


పవర్ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జారే

అశ్వారావుపేట, అక్టోబరు9: పామాయిల్ రైతులకు మేలు జరిగేందుకు ఫ్యాక్టరీలో పవర్‌ప్లాంట్ నిర్మాణం చేపట్టి, పూర్తి చేయడం జరిగిందని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ తెలిపారు. బుధవారం ఆయన పవర్ ప్లాంట్‌ను పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 12వ తేదీన వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుచే ఈ పవర్ ప్లాంట్‌ను ప్రారంభించడం జరుగుతుందని తెలిపారు. అశ్వారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీ నిర్వహణ కోసం సొంతంగా విద్యుత్‌ను ఉత్పత్తి చేసుకునే విధంగా రూ.35కోట్లతో 2.5 మెగావాట్ల సామర్థ్యం కలిగిన పవర్ ప్లాంట్‌ను ఆయిల్‌ఫెడ్ ఆధ్వర్యంలో నిర్మించడం జరిగిందన్నారు. సమావేశంలో ఆయిల్‌ఫెడ్ అడ్వయిజరీ కమిటీ సభ్యులు ఆలపాటి రామచంద్ర ప్రసాద్, తుమ్మా రాంబాబు, మొగళ్లపు చెన్నకేశవరావు, వేముల భారతి, సుం కవల్లి వీరభద్రరావు, సొసైటీ అధ్యక్షులు చిన్నంశెట్టి సత్యనారాయణ, జేస్ట సత్యనారాయణ చౌదరి, బండి భాస్కర్, కేవీ సత్యనారాయణ, కొయ్యల అచుతరావు, సోయం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పామాయిల్ సదస్సులో రైతులు పాల్గొనాలి

● రైతు అడ్వైజర్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు ఆళపాటి

ములకలపల్లి: అశ్వరావుపేట ఆయిల్‌ఫామ్ ప్యాక్టరీలో ఈ నెల 12వ తేదీన జరగనునున్న ఆయిల్‌ఫామ్ సదస్సుకు రైతులు అధికసంఖ్యలో పాల్గొనాలని పామాయిల్ రైతు సంఘం అడ్వజర్ కమిటీ అధ్యక్షులు ఆళపాటి తెలిపారు. బుధవారం ములకలపల్లి ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో రైతులు అమర్‌నాథ్, చందర్‌రావు, కరుటూరి కృష్ణ, పాల్గొన్నారు.

పారదర్శకంగా రవాణా సేవలు

- డిప్యూటీ కమిషనర్ పుప్పాల శ్రీనివాస్


మాట్లాడుతున్న రవాణాశాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్

ఖమ్మం సంక్షేమ విభాగం, అక్టోబరు 9: రవాణాశాఖ ద్వారా పారదర్శకంగా సేవలను అందిస్తున్నామని రవాణాశాఖ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ పుప్పాల శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం జిల్లా రవాణాశాఖ కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. ట్యాక్స్ వసూళ్లు, రవాణా ఆదాయంపై ఇన్‌చార్జి డీటీవో వెంకటరమణ, ఎంవీఐ స్వర్ణలతతో సమీక్షించారు. కార్యాలయంలో పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో ఎంవీఐలు, కార్యాలయ ఉద్యోగుల పనితీరు బాగుందన్నారు. ఆదాయ లక్ష్యాలు 101శాతానికి ఇప్పటికే పెరిగాయని వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా రవాణా అధికారుల కొరత ఏర్పడటంతో మరో అధికారిని ఖమ్మానికి కేటాయించలేకపోయామన్నారు. రవాణాశాఖ కార్యాలయాల్లో పౌరసేవలను ప్రదర్శన చేస్తామన్నారు. సమావేశంలో పోలీస్ సిబ్బంది ఉన్నారు.

జోనల్ డ్యూటీ మీట్‌లో
భద్రాద్రి జిల్లాలో 13 మందికి పతకాలు


పతకాలు సాధించిన భద్రాద్రి జిల్లా పోలీస్ అధికారులు, సిబ్బంది

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, అక్టోబరు9: జోనల్ డ్యూటీ మీట్‌లో భద్రాద్రి జిల్లాకు చెందిన 13 మంది పోలీస్ అధికారులకు, సిబ్బందికి పతకాలు వరించాయి. ఇటీవలే వరంగల్‌లో ముగిసిన జోనల్ డ్యూటీ మీట్‌లో పథకాలు పొందిన వారిని బుధవారం జిల్లా పోలీస్ యంత్రాంగం అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ మీట్‌లో జిల్లాలో ముగ్గురు ఇన్‌స్పెక్టర్లు, ముగ్గురు ఎస్ఐలు, పోలీస్ పీఆర్వోతో పాటు మరో ఆరుగురు సిబ్బందికి ఈ పతకాలు పొందారు. ఈ మీట్లో సైంటిఫిక్ ఏయిడ్స్ టూ ఇన్వెస్టిగేషన్, కంప్యూటర్ అవేర్నెస్, పోలీస్ ఫోటో గ్రఫీ, పోలీస్ వీడియో గ్రఫీ, యాంటీ సబోటేజ్ చెక్ కాంపిటీషన్, డాగ్స్క్వాడ్ కాంపి విభాగాలలో పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుంచి సైంటిఫిక్ ఏయిడ్స్ టూ ఇన్వెస్టిగేషన్ విభాగంలో అశ్వారావుపేట సీఐ తాటిపాముల కరుణాకర్ రెండు బంగారు పతకాలతో పాటు కాంస్య పతకం, రజత పతకాన్ని సాధించారు. కొత్తగూడెం వన్‌టైన్ ఇన్‌స్పెక్టర్ ముస్పారపు కరుణాకర్ ఒక బంగారు, ఒక కాంస్య పతకాలను సాధించగా, టూటౌన్ ఇన్‌స్పెక్టర్ టి.రమేష్ ఒక రజత పతకం, రెండు కాంస్య పతకాలు , చండ్రుగొండ ఎస్ఐ గంజి స్వప్న రెండు రజత పతకాలు, ఇల్లెందు ఎస్ఐ నాగుల్‌మీరాఖాన్ కాంస్య పతకాన్ని సాధించారు. ఆదేవిధంగా కంప్యూటర్ అవేర్నెస్ ప్రోగ్రామింగ్ ఎబిలిటీ విభాగంలో జూలూరుపాడు ఎస్ఐ రాణా ప్రతాప్ బంగారు పతకాన్ని సాధించారు. ఇక పోలీస్ ఫోటోగ్రఫీ అండ్ వీడియోగ్రఫీ విభాగాల్లో జిల్లా పోలీస్ పీఆర్వో దాములూరి శ్రీనివాస్ రెండు రజత పతకాలను సాధించారు. వీడియో గ్రఫీ విభాగంలో కానిస్టేబుల్ కె.నరేందర్ కాంస్య పతకం, సైంటిఫిక్ ఏయిడ్స్ టూ ఇన్వెస్టిగేషన్ విభాగంలో కానిస్టేబుల్ ప్రశాంత్ రజత పతకం, డాగ్ స్క్వాడ్లో ఒక బంగారు, రెండు రజత పతకాలు సాధించారు.

రామాపురంలో వెలసిన మావోయిస్టు పోస్టర్లు

బూర్గంపాడు, అక్టోబరు 9: మండల పరిధిలోని సందెళ్ల రామాపురం సమీపంలోని అటవీ ప్రాంతంలో మావోయిస్టు పోస్టర్లు వెలిశాయి. మంగళవారం రాత్రి సమయంలో మణుగూరు-పాల్వంచ ఏరియా కమిటీ, బీకే ఏఎస్ఆర్ డివిజన్ కమిటీ పేరిట బ్యానర్లు, పోస్టర్లు వెలిశాయి. మావోయిస్టు పార్టీ ఏర్పడి 20 ఏళ్ల కావస్తున్నందున వారికోత్సవాలను విప్లవోత్సాహంతో నిర్వహించుకోవాలని పిలుపునిచ్చారు. ప్రజా పునాదిని బలోపేతం చేస్తూ ప్రజా యుద్ధాన్ని పురోగమింప చేయాలని పోస్టర్లలో ముద్రించారు. శత్రువు చేపట్టిన ఆపరేషన్ కగార్ దాడిని ఓడించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. దీనిపై ఎస్ఐను వివరణ కోరేందుకు ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు. అదనపు ఎస్ఐ నాగభిక్షం మాట్లాడుతూ పోస్టర్లను స్వాధీనం చేసుకున్నామని వాటిపై విచారణ చేపట్టామని తెలిపారు. కాగా మండలంలో మావోయిస్టు పోస్టర్లు వెలవడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

యూటీఎఫ్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా
అలుగుబెల్లి నర్సిరెడ్డి


నర్సిరెడ్డిని అభినందిస్తున్న ఉపాధ్యాయ, అధ్యాపక సంఘం నాయకులు

ఖమ్మం ఖానాపురంహవేలి అక్టోబరు 9: వరంగల్- ఖమ్మం- నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గం నుంచి ఉపాధ్యాయ, అధ్యాపక సంఘాల మద్దతుతో యుటీఎఫ్ అభ్యర్థిగా అలుగుబెల్లి నర్సిరెడ్డి తిరిగి పోటీ చేస్తున్నట్లు టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కే. జంగయ్య, చావా రవి తెలిపారు. బుధవారం నగరంలోని సంఘం కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నర్సిరెడ్డి మాట్లాడుతూ గత ఐదున్నర సంవత్సరాలుగా విద్యా రంగం, ఉపాధ్యాయుల, అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి కృషి చేశానన్నారు. నర్సిరెడ్డి అభ్యర్థిత్వాన్ని బలపరుస్తూ పలువురు ఉపాధ్యా, అధ్యాపక సంఘాల నాయకులు మద్దతు తెలిపారు.



అంకుర ఆసుపత్రిని ప్రారంభిస్తున్న మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి

అంకుర ఆసుపత్రి ప్రారంభం

- హాజరైన మంత్రులు తుమ్మల, పొంగులేటి, ఎంపీ రఘురాంరెడ్డి

ఖమ్మం, అక్టోబరు9 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలోని గేరిల్లా పార్క్, సీక్వెల్ రిసార్ట్స్ సమీపంలో నూతన భవనంలో ఏర్పాటు చేసిన అంకుర ఆసుపత్రిని బుధవారం వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ శాఖమంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎంపీ రఘురాంరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైద్య రంగంలో అంకుర ఆసుపత్రికి స్త్రీలు, పిల్లలకు సంబంధించి ప్రత్యేక స్థానం సంపాదించుకుందన్నారు. హైదరాబాద్ స్థాయిలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఏర్పాటు చేయడం హర్షించదగిన విషయమన్నారు. దశాబ్ద కాలంగా హాస్పిటల్ యాజమాన్యం సామాజిక సేవలను తలపించేలా వైద్యసేవలు అందించడం హర్షదాయకమన్నారు. నాణ్యమైన వైద్యసేవలను అందుబాటులోకి తీసుకొచ్చిన యాజమాన్యాన్ని వారు అభినందించారు. అంకుర హస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాకర్ వున్నం కృష్ణప్రసాద్ మాట్లాడుతూ గతంలో ఖమ్మంలో లేని విధంగా తమ ఆసుపత్రిలో మహిళలు, పిల్లలకు సంబంధించిన అన్నీ సేవలు ఒకే కేంద్రంలో అందించే విధంగా అంకుర ఆసుపత్రిని తీర్చిదిద్దినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంకుర ఆసుపత్రి డైరెక్టర్లు డాక్టర్ రాకేష్ చల్లగుళ్ల, డాక్టర్ దుర్గా ప్రసాద్, సందీప్‌రెడ్డి, హౌజింగ్ కార్పోరేషన్ ఛైర్మన్ మువ్వా విజయ్ బాబు, గిడ్డంగుల సంస్థల ఛైర్మన్ రా యల నాగేశ్వరరావు, ఖమ్మం మేయర్ పునకొల్లు నీరజ, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు, డీఎంహెచ్‌వో డాక్టర్ వి. సుబ్బారావు, కార్పోరేటర్ కర్నాటి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో కల్లూరు ప్రభుత్వ ఆసుపత్రి

- ఒకే భవనంలో సీహెచ్‌సీ, పీహెచ్‌సీ వైద్య సేవలు
- బిక్కు బిక్కు మంటూ విధులు నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది




కల్లూరు ప్రభుత్వ ఆసుపత్రి (ఇన్‌సెట్‌లో భవనం పెచ్చులూడుతున్న దృశ్యం)

కల్లూరు, అక్టోబరు 9: కల్లూరులోని ప్రభుత్వ ఆసుపత్రి భవనం శిథిలావస్థకు చేరకున్నది. ఇటీవల ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు స్లాబ్‌పై భాగంలో పెచ్చులుడి పడుతున్నాయి. ఇదే భవనంలో గత రెండున్నర సంత్సరాల క్రింతం నుంచి సీహెచ్‌సీ, పీహెచ్‌సీ వైద్య సేవలు కొనసాగుతున్నాయి. ఈ భవనంలో వైద్యుల, రోగుల, ఆపరేషన్ థియేటర్, మందుల నిల్వ, రోగులకు వైద్య సేవలు అందించే గదులు, తదితర గదుల్లో వర్షపు నీరు పడుతున్నాయి. దీంతో వరద నీరు చేరడంతో ఈ ఆసుపత్రులకు వచ్చే రోగులకు వైద్య సేవలు అందించడం ఇబ్బందికరంగా మారుతుందని వైద్య సిబ్బంది పేర్కొంటున్నారు. ఇదే భవనంలో సీహెచ్‌సీ 50 పడకలుగా విస్తరించి వైద్యసేవలు అందిస్తుండగా, మరో వైపున గతంలో ఇదే భవనంలో సాగిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సేవలు కూడా అందుతున్నాయి. అందుకు గల కారణం భవన వసతి సౌకర్యాలు లేక పోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. ప్రతి నిత్యం ఇక్కడకు సగటున రోజుకు 150 నుంచి 200 పైగా రోగులు పలు రకాల వైద్య సేవలకు వస్తున్నారు. సీహెచ్‌సీ పరిధిలో వైద్యులు, నర్సులు, సిబ్బంది కలిపి 29 మంది ఉండగా, పీహెచ్‌సీ పరిధిలో వైద్యులతో కలపి 15 మంది వరకు ఉన్నారు. శిథిలమైన ఈ భవనంలో స్లాబ్ భాగం వర్షానికి తడిసి పెచ్చులుడి పడటంతో ఏ సమయంలో ఏం ప్రమాదం జరుగుతుందోనని వైద్యులు, సిబ్బందిలు భయాందోళనకు గురవుతున్నారు. ఇలా రెండు విధాలుగా సీహెచ్‌సీ, పీహెచ్‌సీ వైద్య సేవలు సాగుతున్న ఈ భవనం శిథిలమై ప్రమాదకరంగా ఉన్నప్పటికీ ఇంత వరకు ఏ అధికారి పర్యవేక్షించక పోవడంపై రోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిరుపేద ప్రజలకు వైద్య సేవలు అందించాల్సిన ఈ ఆసుపత్రుల నిర్వహణకు ఎలాం టి ఆటకం కలగకుండా జిల్లా అధికార యంత్రాంగం ప్రత్యామ్నాయ మార్గంవైపు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. ఆసుపత్రి వైద్య సేవల సమయంలో స్లాబ్‌పై భాగం పెచ్చులుడి పడితే ప్రాణ నష్టం కూడా జరిగే అవకాశం ఉంది.

నూతన ఆసుపత్రి భవనాన్ని సత్వరమే పూర్తి చేయాలి: స్థానికులు

కల్లూరులో సుమారు రూ.10 కోట్ల అంచనాతో నిర్మాణం చేపట్టిన సీహెచ్‌సీ ఆసుపత్రి భవనాన్ని సత్వరమే పూర్తి చేసేలా మంత్రులు, అధికారులు చూడాలని కోరుతున్నారు. ఈ భవనం నిర్మాణ దశలో ఉంది. ఇప్పటికైనా ఆసుపత్రి నూతన భవన నిర్మాణం పూర్తి అయితే స్థానికంగా వైద్య సేవలు ప్రజలకు మరింతగా అందే అవకాశాలు ఉన్నాయి.

జిల్లాలో కస్టమ్ మిల్లింగ్ రైస్
పక్కదారిపై విచారణ పూర్తి

- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీజ

ఖమ్మం, అక్టోబరు 9: జిల్లాలో కస్టమ్ మిల్లింగ్ రైస్ పక్కదారిపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పి. శ్రీజ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత రబీ, ఖరీఫ్‌కు సంబంధించి రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని మిల్లింగ్ చేసి, కస్టమ్ మిల్లింగ్ రైస్‌ను తిరిగి ఇవ్వడానికి జిల్లాలోని రైస్ మిల్లులకు వాటి వాటి సామర్థ్యం మేరకు ధాన్యం కేటాయింపులు చేసినట్లు తెలిపారు. క్షేత్ర స్థాయిలో ఏ మిల్లర్ వద్ద ఎంత ధాన్యం ఉంది, కస్టమ్ మిల్లింగ్ రైస్ కి ఎంత ధాన్యం ఇచ్చారు, ఇంకా ఎంత రావాల్సి ఉంది వివరాలు ఎప్పటికప్పుడు తనిఖీలు చేయాల్సిన బాధ్యత పౌరసరఫరాల శాఖ అధికారులపై ఉందని తెలిపారు. గత నెల 24న చేపట్టిన తనిఖీల్లో కొన్ని మిల్లుల్లో కేటాయించిన ధాన్యం నిల్వలు లేనట్లుగా గుర్తించినట్లు వివరించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు విచారణ చేపట్టామని పేర్కొన్నారు. విచారణను పూర్తిచేసి, జిల్లా కలెక్టర్‌కు నివేదికను అందించినట్లు ఆమె తెలిపారు. ధాన్యం బియ్యం అప్పగించని మిల్లర్లపై చట్ట ప్రకారం బాధ్యులపై చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. సీఎంఆర్ బియ్యాన్ని పక్కదారి పట్టించిన మిల్లర్లపై రెవెన్యూ రికవరీ యాక్ట్ ప్రకా రం, విధుల పట్ల బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిన అధికారులపై శాఖాపర చర్యలు చేపట్టనున్నట్లు హెచ్చరించారు.

నిధుల దుర్వినియోగంపై కలెక్టర్‌కు ఫిర్యాదు

ఆళ్లపల్లి, అక్టోబరు 9: ఆళ్లపల్లి మండలం, మర్కోడు గ్రామ పంచాయతీకి చెందిన నిధులు దుర్వినియోగం జరిగినట్టుగా మర్కోడు గ్రామానికి చెందిన రేసు వెంకన్న బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. 10 సెప్టెంబరు 2024, నుంచి 20 సెప్టెంబర్ 2024 (10 రోజులు)వరకు అడవిరామవరం పంచాయతీ కార్యదర్శి, మర్కోడు గ్రామ పంచాయతీకి ఇన్‌చార్జీ కార్యదర్శిగా బాధ్యతలు తీసుకోగా, పది రోజుల వ్యవధిలో మర్కోడు పంచాయతీ నుంచి సుమారుగా రూ.3లక్షలు డ్రా చేసి లెక్కలు లేకుండా దుర్వినియోగం చేశారని ఆరోపిస్తు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. పంచాయతీ లెక్కలపై పూర్తి విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆయన ఫిర్యాదులో కోరారు.

కొనసాగుతున్న శరన్నవరాత్రులు

ఆలయాల్లో వైభవంగా సరస్వతీదేవి పూజలు

కొత్తగూడెం సాంస్కృతికం, అక్టోబరు 9: దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం మూల నక్షత్రాన్ని పురస్కరించుకుని కొత్తగూడెంలోని దేవాలయాలు, ఉత్సవ మండపాల్లో సరస్వతీదేవికి ఘనంగా పూజలు నిర్వహించారు. దుర్గాదేవి అమ్మవారిని సరస్వతీ దేవిగా అలంకించి ప్రత్యేక పూజలు చేసారు. చిన్నారులకు అక్షరభ్యాసాలను నిర్వహించారు. కూలీలైన్ ఏరియా సరస్వతీ శిశుమందిర్ వద్ద ఏర్పాటుచేసిన మండపంలో 21రకాల ప్రసాదాలతో సుహాసిని అమ్మవారికి నైవేద్యాన్ని సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పెద్దమ్మతల్లి ఆలయంలో..

పాల్వంచ రూరల్: పెద్దమ్మతల్లి ఆలయంలో అమ్మవారి మూలనక్షత్రం రోజు బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని సరస్వతి దేవి అలంకరణలో అలంకరించారు. భక్తులు అధికసంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.

సరస్వతీ దేవి అలంకారంలో..

అశ్వారావుపేట: అశ్వారావుపేటలోని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో బుధవారం అమ్మవారు సరస్వతి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున చిన్నారులు సరస్వతి పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారులకు వాసవిక్లబ్ ఆధ్వర్యంలో పెన్నులు, పుస్తకాలను అందజేసారు.



కొత్తగూడెం బూడిదగడ్డలో..

సరస్వతి పూజలు

జూలూరుపాడు: జూలూరుపాడులోసరస్వతి పూజలను నిర్వహించారు. అమ్మవారు సరస్వతి అలంకరణలో దర్శనమిచ్చారు. సరస్వతి పూజల్లో చిన్నారులు పాల్గొన్నారు.

సరస్వతి అవతారంలో గాయత్రీ దేవి

మణుగూరు/ పినపాక: మణుగూరు మండలంలోని గుట్టమల్లారం గ్రామంలో గల పంచముఖ వేద గాయత్రీ దేవాలయంలో బుధవారం అమ్మవారు సరస్వతి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. బేతం చర్ల వెంకటేశ్వర్లు నూకలపాటి నాగేశ్వరరావు దంపతులు కలువ పూలతో అమ్మవారికి పూజలు నిర్వహించారు.



పెద్దమ్మతల్లి ఆలయంలో..

పినపాకలో: చదువుల తల్లి సరస్వతీ దేవిగా అమ్మవారు దర్శనమిచ్చారు పోతిరెడ్డిపల్లిలో కొలువు దీరిన అమ్మవారు చదువుల తల్లిగా దర్శనమిచ్చారు. విద్యార్థులు తమ పుస్తకాలను అమ్మవారి వద్ద ఉంచి విద్యలో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని పూజించారు. గ్రామానికి చెందిన భక్తులు ప్రత్యేక నేవేద్యాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అధిక సంఖ్యలో అమ్మవారికి పూజలు నిర్వహించారు.

1.50లక్షల ఎకరాల్లో మునగసాగుకు చర్యలు

వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ జితేష్ వి పాటిల్



కొత్తగూడెం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని నర్సరీలు, మొరింగా ప్లాంటేషన్, అజోల్ల పెంపకం, కెనాల్ బండ్ ప్లాంటేషన్, మహిళా శక్తి యూనిట్లు, చేపల పెంపకం, పుట్ట గొడుగుల పెంపకం, గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళిక, పీఎం విశ్వకర్మ పథకం అమలుపై జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందనతో కలిసి జిల్లాలోని ఎంపీడీవోలు, ఎంపీవోలు, ఏపీవోలు, ఏపీఎంలు, ఈసీఎస్‌లతో ఐడీఓసీ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నర్సరీల్లో ఏదో ఒక మొక్కలు కాకుండా వాతావరణానికి, ఆయుర్వేదంగా అనుకూలమైనమొక్కలు దొరంతో, డెకోమా, యూజీనియా, పండానాజ్, సుబాబుల్, వేప, రావి, గానుగ మొక్కల పెంపకం చపట్టాలన్నారు. జిల్లాలోని అన్ని కెనాల్ రెండు వైపులా జామాయిల్, బాంబు, సుబాబుల్, యూకలిప్టస్ మొక్కలు నాటాలన్నారు. జిల్లాలోని అన్ని పాఠశాలలో ప్రభుత్వ కార్యాలయాల్లో, ఖాళీ ప్రదేశాల్లోమునుగు, ఉసిరి, పనస, మారేడు, మేడి, అల్లనేరేడు మొక్కలు నాటాలని సూచించారు. జిల్లాలోని అన్ని గ్రామపంచాయతీల కార్యదర్శులు తమ పరిధిలోని గృహాలు ప్రభుత్వ కార్యాలయాలు పంచాయతీ ప్రదేశాలో బట్టి ఎన్ని మొక్కలు పెడతాయో అంచనా వేసుకోవాలని దాని ప్రకారం మొక్కల పెంపకం చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు.

గీత కార్మికులకు కవచాలుగా పరికరాలు



పరికరాలను అందజేస్తున్న ఎమ్మెల్యే జారే

అశ్వారావుపేట టౌన్, అక్టోబరు 9: గీతకార్మికులకు రక్షణ కవచాలుగా ఉండేందుకు, ప్రమాదాల బారిన పడకుండా కాపాడేందుకు గీత కార్మికులకు కాటమయ్య రక్షణ కవచ పరికరాల యూనిట్లును పంపిణీ చేస్తున్నట్టు ఎమ్మెల్యే జారే ఆదినారాయణ తెలిపారు. బుధవారం అశ్వారావుపేటలో ఆబ్కారీ శాఖ ఆధ్వర్యంలో కాటమయ్య రక్షణ కవచ పరికరాల యూనిట్లు పంపిణీ జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా హాజరైన ఎమ్మెల్యే జారే ఆదినారాయణ మాట్లాడారు.

వామపక్ష చైతన్యానికి ప్రతీక సింగభూపాలెం

సుజాతనగర్, అక్టోబరు 9: సీపీఎం సింగభూపాలెం గ్రామ సభ సింగ భూపాలెం గ్రామంలోని సీతారాం ఏచూరి ప్రాంగణంలో బుధవారం నిర్వహించారు. గ్రామంలో తొలుత ప్రదర్శన నిర్వహించారు. అనంతరం పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు బుగ్గవీటి సరళ జెండా ఆవిష్కరణగావించారు. పార్టీ జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ప్రారంభ సభలో కాత్రాల తిరుపతిరావు అమరులకు సంతాప తీర్మా నాన్ని ప్రవేశ పెట్టారు. అనంతరం పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు కా సాని ఐలయ్య మాట్లాడుతూ సుజాతనగర్ మండలంలో అనేక సమస్య లకు సీపీఎం నాయకత్వం వహించి పరిష్కరించిందన్నారు. మండ లంలో మొదటి నుంచీ వామపక్ష చైతన్యానికి ప్రతీకగా సింగభూపాలెం నిలిచిందని అన్నారు. గ్రామాలలో అనేక సమస్యలు చర్చకు వచ్చాయని, ఆయా సమస్యల పరిష్కారానికి భవిష్యత్తులో కృషి చేస్తారని అన్నారు. పలు సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి సీపీఎం ఆధ్వర్యంలో అనేక పోరాటాలు నిర్వహించామని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు లిక్కి బాలరాజు, పార్టీ మండల కార్యదర్శి వీర్ల రమేష్, మండల నాయకులు వెంకటేశ్వర్లు, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి హరికృష్ణ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరభద్రం, పీఎస్ఎం శ్రీధర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అయిలయ్య

బతుకమ్మ వేడుకల్లో ఎమ్మెల్యే జారే ఆట, పాట

చంద్రుగొండ, అక్టోబర్ 9: చంద్రుగొండలో బుధవారం రాత్రి జరిగిన బతుకమ్మ వేడుల్లో ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పాల్గొన్నారు. చంద్రుగొండతో పాటు శివారు గ్రామాల్లో మహిళలు ఏర్పాటు చేసిన బతుకమ్మ వేదికల వద్ద మహిళలతో కలిసి ఎమ్మెల్యే ఆటపాటలాడారు. ఈ సందర్భంగా సంబురాల నిర్వాహణ కొరకు కొంత ఆర్థిక చేయూత అందచేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు భోజ్యానాయక్, ఉప్పతల ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో..

మణుగూరు టౌన్: మణుగూరు మండలంలోని తహశీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో బుధవారం రాత్రి బతుకమ్మ సంబరాలు ఎంతో ఘనంగా నిర్వహించారు. తహశీల్దార్ రాఘవ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ వేడుకలకు అధిక సంఖ్యలో మహిళలు చిన్నారులు యువతులు పాల్గొన్నారు. 20 అడుగుల బతుకమ్మను తీరొక్క పూలతో సుందరంగా ముస్తాబు చేసి ప్రాంగణంలో ఏర్పాటు చేయగా ప్రాంగణానికి కొత్త శోభ చేకూరింది. తెలంగాణ సంస్కృతి తల్లాడ నుంచి విచ్చేసిన తహశీల్దార్ బంధువులైన మహిళలు ప్రదర్శించిన కోలాట నృత్యాలు అందరినీ ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయి. అశోక్‌నగర్, పూజారినగర్, ఆదర్శనగర్, సుందరయ్య నగర్ ప్రాంతాల నుంచే కాకుండా అశావర్కర్లు, అంగన్‌వాడీ సిబ్బంది రెవెన్యూ సిబ్బందితో పాటు పలు శాఖలకు చెందిన మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఐద్వా మహాసభల వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

భద్రాచలం, అక్టోబరు 9: ఈ నెల 21 నుంచి కొత్తగూడెంలో జరిగే అఖిల భారత ప్రజాతంత్ర మహిళ సంఘం (ఐద్వా) రాష్ట్ర మహాసభల వాల్‌పోస్టర్లను భద్రాచలంలో బుధవారం ప్రచార వాల్‌పోస్టను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా అధ్యక్షురాలు డి.సీతాలక్ష్మి ఉపాధ్యక్షులు ఎన్.లీలావతిలు మాట్లాడుతూ మహిళ హక్కులు సాధన కోసం, మహిళ చట్టాల రక్షణ కోసం, మహిళ సమస్యలపై నిరంతరం పోరాడుతున్న అఖిల భారత ప్రజాతంత్ర మహిళ సంఘం మహాసభలను జయప్రదం చేయాలన్నారు. ఈ సమావేశంలో ఐద్వా నాయకులు మచ్చా రమాదేవి, ఏజే గౌతమి, వై.పూర్ణ, ఎం.సుబ్బలక్ష్మి, జి.నాగలక్ష్మి పాల్గొన్నారు.

పండుగలు ఐకమత్యానికి వేదికకావాలి

కొత్తగూడెం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్య భారతదేశంలో ప్రతి పండుగను ఐక్యమత్యానికి వేదికలుగా నిలపాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే. సాబీర్‌పాషా అన్నారు. రామవరం ప్రాంతంలోని 10, 11 వార్డుల పరిధిలోని నెహ్రూ బస్తీ, లక్ష్మీటాకీస్ ఏరియా, వనందాస్ గడ్డ ఏరియాలో ఉత్సవ కమిటి ఏర్పాటుచేసిన శ్రీకనకదుర్గ దేవి నవరాత్రి మండ పాలను సందర్శించిన అనంతరం మహాన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. శ్రీ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాచీన సంస్కృతి, సంప్రదాయాలను పాటిస్తూ భావితరాలు వాటి ప్రముఖ్యత చాటడం మంచి పరిణామమన్నారు. పండగలు ఐకమత్యంగా జరుపుకోవాలన్నారు. ఈ కా ర్యక్ర మంలో సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు మునిగడప వెం కటేశ్వ ర్లు, భూక్య శ్రీనివాస్, 10వ వార్డు కౌన్సిలర్ మునిగడప పద్మ, సీపీఐ నాయకులు గుత్తుల శ్రీనివాస్, సూరిమేని జనార్దన్, గు గులోత్ శంకర్, శ్రీనివాస్, మహేష్, నాయకులు దిలీప్, దిలీప్ గుప్తా, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌కు తరలిన డీఎస్సీ అభ్యర్థులు

కొత్తగూడెం అర్బన్, అక్టోబరు 9: డీఎస్సీ 2024లో అర్హత సాధించిన అభ్యర్థులను విద్యాశాఖ ప్రత్యేక బస్సులలో హైదరాబాద్‌కి తీసుకెళ్లారు. బుధవారం కొత్తగూడెం ప్రకాశం స్టేడియం నుంచి అభ్యర్థులను తీసుకెళ్తున్న బస్సులను ఉదయం 6గంటలకు జెండా ఊపి డీఈవో వెంకటేశ్వరచారి ప్రారంభించారు. ఎల్బి స్టేడియంలో సీఎం రెంత్‌రెడ్డి సమక్షంలో అభ్యర్థులకు సాయంత్రం 4 గంటలకు నియామకపత్రాలు అందజేశారు. జిల్లాలో మొత్తం 447 పోస్టులకు గాను 413 మందిని ఆయా పోస్టులకు ఎంపికచేశారు. మిగిలిన 34పోస్టులకు రోస్టర్ విధానంలో రిజర్వేషన్లు లేకపోవడంతో ఎంపిక చేయలేదని అధికారులు తెలిపారు. రాష్ట్ర ఉన్నతాధికారుల మార్గదర్శకాల ప్రకారం అభ్యర్థులను ఎంపికచేస్తామన్నారు. వీరందరికి నియామకపత్రాలు అందిస్తారని డీఈవో తెలిపారు. అభ్యర్థుల వెంట డీఈవోతో పాటు జిల్లా సెక్టోరియల్ అధికారులు సైదులు, సతీష్‌కుమార్, ఫైనాన్స్ అండ్ అకౌంటింగ్ అధికారి శ్రీనివాసరావు, ఏంఈఓలు, పీజీహెచ్ఎంలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలను అమలు చేయాలి

దుమ్ముగూడెం, అక్టోబరు 9: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీలను అమలు చేయాలని సీపీఎం రాష్ట్ర నాయకులు మచ్చా వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. బుధవారం లక్ష్మీనగరం, అచ్యుతాపురం శాఖా సమావేశాల్లో మాట్లాడారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పదినెలల అవుతున్నప్పటికీ, కేవలం రెండు గ్యారంటీలు మాత్రమే అమలౌతున్నాయని తెలిపారు. కారం పుల్లయ్య, యలమంచి వంశీకృష్ణ, చంద్రయ్య, కోటేశ్వరావు, రాజమ్మ, రాంమోహన్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, బేగ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కనకయ్యకు ఘన సన్మానం

ఇల్లెందు టౌన్, అక్టోబరు 9: ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్యను బుధవారం వ్యవసాయమార్కెట్ అధికారులు, సిబ్బంది ఘనంగా సత్కరించారు. వ్యవసాయమార్కెట్ కార్యదర్శి నరేష్‌కుమార్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ వ్యవసాయ మార్కెట్ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్‌కమిటీ కార్యదర్శి నరేష్‌కుమార్‌తోపాటు సిబ్బంది శ్రీనివాసరావు, లక్ష్మీ, విజయ, లక్ష్మయ్య, రంజిత్, మోహన్‌రావు, మధు, రమేష్ పాల్గొన్నారు.



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న దృశ్యం

బతుకమ్మ వేడుకల్లో ఎమ్మెల్యే

ఇల్లెందు పట్టణంలోని వెలుగు కార్యాలయంలో జరిగిన బతుకమ్మ వేడుకల్లో ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. వెలుగు కార్యాలయ ఆవరణలో మండల సమాఖ్య ఆధ్వర్యంలో జరిగిన వేడుకలో ఆట, పాటలతో అలరించారు. మహిళలు బతుకమ్మలతో పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ప్రకృతి పండుగగా బతుకమ్మ ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందిందని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఏపీఎం దుర్గారావు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు

ఆళ్లపల్లి, అక్టోబరు 9: దసర పండుగను పురష్కరించుకుని ఆళ్లపల్లి మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో క్రికెట్ క్రీడలు ఏర్పాటు చేశారు. క్రీడలను కాంగ్రెస్ పార్టీ కో-కన్వీనర్ వాసం శ్రీకాంత్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎండీ అతహార్, పీహెచ్‌సీ వైద్యులు రేవంత్ ప్రారంభించారు. క్రీడలతో యువతలో స్నేహభావం పెరుగుతుందని అన్నారు.

దివ్యాంగుల సహాయ ఉపకరణాల ఎంపిక శిబిరం

అశ్వారావుపేట, అక్టోబర్ 9: బుదవారం జిల్లా సంక్షేమ శాఖ అధికారి ఆధ్వర్యంలో పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో ఆర్టిఫిషియల్ లింబ్‌మాన్యుఫ్యాక్చరింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సహకారంతో దివ్యాగంుల సహాయ ఉపకరణాల ఎంపిక కోసం శిబిరాన్ని నిర్వహించారు. 82 దివ్యాంగులకు బ్యాటరీ ట్రైసైకిల్స్, వీల్ చైర్‌లు, వినికిడి యంత్రాలు, అంధుల చేతిక ర్రలు, కృత్రిమ అవయవాలు, చంక కర్రలు కొరకు ఎంపిక చేయడం జరిగింది. నేటి ఎంపికకు హాజరుకాలేనివారు 11వ తేదీన డీపేసీ కార్యాలయం, పాల్వంచ నందు జరిగే శిభిరానికి హాజరు కావాలని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్, అలింకో సిబ్బంది రఫ్మీ, రంజాన్‌శెట్టి, అభిషేక్ ద్వివేది పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

జూలూరుపాడు, అక్టోబరు 9: చట్టాలు, ఆన్‌లైన్ మోసాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని హ్యూమన్ రైట్స్ సోసైటీ వ్యవస్థాపకుడు ఎ.ఆనందం తెలిపారు. ఆ సోసైటీ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చట్టాలపై ఈజీఎస్ క్షేత్ర సహాయకులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల ఎన్నో అనార్థాలు కలుగు తాయన్నారు. ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఇండాలని తెలిపారు. హ్యూమన్‌రైట్స్ సోసైటీ రాష్ట్ర కన్వీనర్, లీగల్ అడ్వైజర్ ఇనప నూరి మహేందర్‌నాద్ మాట్లాడుతూ కోర్టు కేసులు, సివిల్ కేసులపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. చట్టాలపై ప్రతీ ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కరుణాకర్‌రెడ్డి, ఎంపీవో తులసీరాం, ఎపీవో రవి, సోసైటీ సభ్యులు మణి, మోదుగు వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సేవలు అందించే పార్టీలకే ప్రజాదరణ

సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా

కొత్తగూడెం, అక్టోబర్ 4 (ఆంధ్రజ్యోతి): నాటి నుంచి నేటి వరకు రామవరం ప్రజలు సీపీఐని ఆదరిస్తున్నారని ఆరి వారి ఆశలు, ఆకాక్షలు అనుగుణంగా సీపీఐ ప్రజాసేవకు అంకితమైందని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే. సాబీర్‌పాషా అన్నారు. రామవరం ఏరియాలో 11వ వార్డు వనందాస్‌గడ్డకు చెందిన బానోత్ శ్రీను, అర్జున్, బానోత్ సక్రు, సురేష్, రమేష్, మహేష్, బిక్కులాల్ తదితరుల నేతృత్వంలో బుధవారం వనందాస్‌గడ్డలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన సమక్షంలో 20 కుటుంబాలు సీపీఐలో చేరాయి. వీరికి ఎర్రకండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారానికి సీపీఐ ఎళ్లవేళలా పోరాటాలు నిర్వహిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు భూక్య శ్రీనివాస్, మునిగడప పద్మ, జిల్లా నాయకులు మునిగడప వెంకటేశ్వర్లు, జనార్ధన్, గుత్తుల శ్రీను, గుగులోత్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ వేడుకలకు సర్వం సిద్ధం

పాల్వంచ మున్సిపల్ డీఈ స్వరూపరాణి

పాల్వంచ టౌన్, అక్టోబరు 9: తెలంగాణలో ఆడపడుచులు ఎంతో వేడుకలగా గురువారం జరుపుకునే బతుకమ్మ వేడుకలకు సర్వం సిద్ధం చేసినట్లు మున్సిపల్ డీఈ స్వరూపరాణి తెలిపారు. బుధవారం పట్టణ పరిధిలోని చెరువుల వద్ద బతుకమ్మల నిమజ్జన ఘాట్ల వద్ద చేపడుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మున్సిపల్ జనరల్ ఫండ్ నిధులు రూ.5లక్షలతో చింతలచెర్వు, రాతిబంజరచెరువు, హిల్స్‌కాలనీ చెరువు భాగంలో 3ఘాట్ల వద్ద బతుకమ్మల నిమజ్జనానికి ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఒక్కో ఘాట్ వద్ద పది మంది సిబ్బంది పర్యవేక్షణలో ఉంటారన్నారు. కార్యక్రమం జయప్రదం చేయటానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎఈ రాము, వర్క్ ఇన్‌స్పెక్టర్ అంజన్‌రావు, రామజోగి, కొండలరావు పాల్గొన్నారు.